క్లుప్తంగా

పరిహారం అందేలా చూడండి



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో చవటపాళెం గ్రామస్తులు

వెంకటాచలం : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును చవటపాళెం గ్రామస్తులు ఆరుముళ్ల మురళి, కందిమళ్ల శ్రీనివాసులునాయుడు, వర్దగల్లు వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసులు తదితరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్‌సీఆర్టీ సంస్థ కోసం గ్రామ రైతులు ఇచ్చిన భూములకు సంబంధించి పరిహారం త్వరితగతిన అందేలా చూడాలని కోరారు. దీనిపై రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ పి.భాస్కర్, కలెక్టర్ ఆనంద్‌తో రైతులకు అందాల్సిన పరిహారం గురించి వెంకయ్యనాయుడు ఫోన్‌లో మాట్లాడారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

పొదలకూరు : కుల దూషణ కేసుపై నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులునాయుడు శుక్రవారం విచారణ చేపట్టారు. మండలంలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన నాగభూషణంనాయుడు అదే గ్రామానికి చెందిన ఎస్సీ కులానికి చెందిన బాబూరావును తహసీల్దార్ కార్యాలయం వద్ద కులదూషణకు పాల్పడినట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. దీనిని విచారించేందుకు డీఎస్పీ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. సీఐ రాంబాబు, ఎస్సై రామకృష్ణ ఉన్నారు.

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

కొడవలూరు : విద్యతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని ప్రిన్సిపల్ పి.దేవసహాయం అన్నారు. కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గిరిజన చిన్నారి చదువుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. అనంతరం చిన్నారుల గిరిజన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డిప్యూటీ వార్డెన్ షకీలా పాల్గొన్నారు.

మట్టి పరీక్షలు కీలకం

కొడవలూరు : వ్యవసాయంలో మట్టి నమూనా పరీక్షలు కీలకమని ఏడీఏ డి.సుజాత సూచించారు. 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్'లో భాగంగా కొడవలూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యవసాయం ప్రాధాన్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల ఆధారంగా మట్టి స్వభావాన్ని తెలుసుకోవచ్చన్నారు. మట్టిలో ఎలాంటి పోషకాలు లోపించాయి, ఏ ఎరువులు వినియోగించుకోవాలన్న విషయాలు స్పష్టమవుతాయన్నారు. ఏఓ లక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యకర ఉత్పత్తులను అందించాలంటే వ్యవసాయంలో సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.అంకయ్య, ఏఈఓ ఎ.అనూష, వీఏఏ జి.కవిత పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



హల్దార్ మృతదేహం

మనుబోలు : మండలంలోని బద్దెవోలు పంచాయతీ పల్లెపాళెం గ్రామంలో రొయ్యల చెరువు వద్ద శుక్రవారం ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన బాపి హల్దార్(20) తిన్నెలపూడి మస్తానయ్యకు చెందిన రొయ్యల గుంత వద్ద పనిచేస్తున్నాడు. అక్కడే ఓ షెడ్డు వేసుకుని నివాసముంటున్నాడు. ఏం కష్టం వచ్చిందో గానీ పక్కనే ఉన్న వేపచెట్టుకు టవల్‌తో ఉరేసుకుని చనిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మతల్లి దయతో ప్రాజెక్టులకు జలకళ

పొదలకూరు : గంగమ్మ తల్లి దయవల్ల రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నట్లు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక గంగమ్మతల్లి దేవస్థానంలో యాదవులు నిర్వహించిన కొలుపులో శుక్రవారం ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమశిలకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కేవలం ఏడు వేల క్యూసెక్కులు మాత్రమే విడుదల అవుతుండగా తాను పొలిట్‌బ్యూరో సమావేశంలో సీఎంకు విజ్ఞప్తి చేయగా 11 వేల క్యూసెక్కులకు పెంచినట్లు చెప్పారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మండలంలో జరుగుతున్న మైనింగ్, ఇతర రాజకీయ అంశాల గురించి విమర్శలు చేశారు. టీడీపీ నాయకులు మస్తాన్‌బాబు, ఎం.నరసింహులు, మల్లికార్జున్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, సుగుణ, బక్కయ్యనాయుడు, వెంకటరత్నంనాయుడు ఉన్నారు.

కూటమి రాజ్యంలో భద్రత ఏదీ?

- ఓ వైపు బడుగుల ఆరాధ్య దైవంపై దాడి
- మరోవైపు ముస్లిం హక్కులను హరించే బిల్లుకు టీడీపీ మద్దతు
- దీంతో ఆయా వర్గాల్లో ఆగ్రహావేశాలు

రాష్ట్రంలో బడుగు, బలహీన, మైనారిటీలపై ఉక్కుపాదం మోపేలా టీడీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. వారి హక్కులను కాలరాసేలా కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే బీజేపీతో దోస్తీ చేస్తూ ముస్లింలకు వ్యతిరేకంగా తీసుకొచ్చే చట్టాలకు టీడీపీ అధికారికంగా మద్దతు ఇస్తుండగా, తాజాగా వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు కూడా టీడీపీ ఏకపక్షంగా మద్దతు ఇవ్వడంపై ముస్లింలు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా దళితుల ఆరాధ్య దైవంగా భావించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు పచ్చమూకలు అగౌరవాన్ని కలిగించారు. విజయవాడలోని భారీ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ నేతలు దాడి చేయడం పట్ల దళితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దాడి అమానుషం



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం. రాజ్యాంగ నిర్మాతగా, బడుగుల ఆశాజ్యోతిగా దేశ ప్రజలందరూ కీర్తించే అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేయడం మనల్ని మనం అవమానించుకోవడమే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

– పి.శివరాం, అంబేడ్కర్ నగర్, మనుబోలు

పిరికిపంద చర్య



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహంపై టీడీపీ అల్లరి మూకలు దాడులు చేయడం పిరికిపంద చర్య. బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన అంబేడ్కర్ విగ్రహంపై దాడులు చేయడం క్షమించరాని నేరంగా భావించాలి. అలాంటి వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి

– సోనగిరి జగన్, ఇనమడుగు, కోవూరు

తారస్థాయికి పచ్చమూకల పైత్యం



పచ్చమూకల పైత్యం తారస్థాయికి చేరింది. ప్రపంచమే గర్వించదగ్గ మహనీయులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం కంటే దారుణమైన చర్య లేదు. ఇలాంటి వికృత చేష్టలకు పచ్చమూకలు తెగబడుతుంటే అధికార యంత్రాంగం చూస్తూ ఉండిపోవడం సిగ్గుచేటు. ఇది ముమ్మాటికీ సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌ల కనుసన్నల్లోనే జరిగింది. వారిపై చర్యలు తీసుకోవాలి.

– బి.సుప్రియ, సర్పంచ్, నార్తురాజుపాళెం, కొడవలూరు (మం)

కఠినంగా శిక్షించాలి

వెంకటాచలం : విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఇస్కపాళెం సర్పంచ్ అడపాల ఏడుకొండలు డిమాండ్ చేశారు. పచ్చమూకల చీకటి దాడిని ఖండిస్తూ మండలంలోని ఇస్కపాళెంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి, అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని కుట్ర చేయడం దారుణమన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.



టీడీపీ నేతల దాడిని ఖండిస్తూ ఇస్కపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి పాలభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మా దేవుడిపై దాడా?



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించి మాకు సామాజిక సమానత్వం కల్పించిన దేవుడు అంబేడ్కర్ విగ్రహంపై దాడికి పాల్పడడం అత్యంత హేయమైన చర్య. ప్రజాస్వామ్య వాదులంతా ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉంది. పొదలకూరులోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వారు చేసిన మకిలిని కడిగేస్తాం.

– కె.చలపతిరావు, చిట్టేపల్లి, పొదలకూరు మండలం

రాక్షస చర్య



ఎన్నో ఏళ్లుగా సమాజంలో బలహీన వర్గాలుగా ఉన్న మాకు సమాన హక్కులు కల్పించిన దేవుడు అంబేడ్కర్. అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహంపై దాడి చేయడం రాక్షస చర్య. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. సంపదలు సృష్టిస్తామని అధికారంలోకి వచ్చి ఇప్పుడు సంపదలను కూల్చివేయడం సబబు కాదు.

– ఈదూరు ప్రవీణ్, అన్నారెడ్డిపాళెం, విడవలూరు

ప్రపంచ మేధావికి అగౌరవం



భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావిగా గౌరవాలు అందుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. విజయవాడలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని కొందరు ముష్కరులు పగులగొట్టడం సిగ్గు చేటు. సభ్య సమాజం తలవంచుకునే పరిస్థితి ఏర్పడింది.

– బల్లెం వెంకటరమణయ్య, మాజీ సర్పంచ్, నారికేళపల్లి, ముత్తుకూరు మండలం

ప్రజాస్వామ్యంపై దాడి



విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనంపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగా పరిగణించాలి. వెంటనే టీడీపీ ముష్కరులను పోలీసులు అదుపులోకి తీసుకోవాలి. ప్రపంచ మేధావిగా గుర్తింపు తెచ్చుకున్న రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై దాడికి దిగడం అత్యంత పాశవికం. ఇది రాజ్యాంగ స్ఫూర్తినే ప్రశ్నించే విధంగా ఉంది. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేయాల్సి అవసరం ఉంది.

– తెనాలి నిర్మలమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు, పొదలకూరు

అప్రజాస్వామ్యం



అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూకలు దాడి చేయడం అప్రజాస్వామ్యం. పక్కా ప్రణాళికతోనే అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు తెగపడ్డారు. ఈ దాడుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయం ఉన్న ప్రతిఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– అడపాల ఏడుకొండలు, ఇస్కపాళెం, వెంకటాచలం

కఠినంగా శిక్షించాలి



సామాజిక న్యాయం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. అలాంటి ఆరాధ్యదైవం సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి చేసిన టీడీపీ నేతలను కఠినంగా శిక్షించాలి.

– లాలం పెంచలయ్య, కోవూరు

ఇప్పుడున్న విధానంతో నష్టమేమి?



ఇప్పుడు అమలులో ఉన్న వక్ఫ్‌బోర్డు విధానం బాగుంది. అందులో ఎలాంటి సమస్యలు లేవు. ముస్లింల ఆస్తులుగా ఉన్న వాటిపై పెత్తనం చేయాలన్న ఉద్దేశంతోనే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. దీనికి టీడీపీ మద్దతు ప్రకటించడం దారుణం. ముస్లింల హక్కులను హరించే బిల్లుకు టీడీపీ మద్దతు ప్రకటించడం ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే. ఇలాంటి పార్టీలను ముస్లిం వ్యతిరేక పార్టీలుగా భావించాల్సి వస్తోంది. ఈ బిల్లుకు మద్దతు ప్రకటించడమంటే వారు ముస్లింలను దూరం చేసుకొన్నట్లే.

– ఎండీ కరిముల్లా, మైనారిటీ నేత, కొడవలూరు

మా ఆస్తులపై పెత్తనమేంటి



ముస్లిం వక్ఫ్ బోర్డ్ ఆస్తులపై ప్రభుత్వ అజమాయిషీకి ఉద్దేశించిన బిల్లుకు టీడీపీ మద్దతు పలకడం దారుణం. వక్ఫ్ బోర్డ్ ఆస్తులపై ప్రభుత్వ పెద్దలు పెత్తనం చేసేందుకు ఈ బిల్లులు దోహదం చేస్తాయి. మా ఆస్తులపై వారి పెత్తనం సమంజసం కాదు. మైనారిటీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పే టీడీపీ ఈ బిల్లుకు ఎలా మద్దతిస్తుంది.

– ఎస్‌కే చాంద్‌బాషా, కసుమూరు దర్గా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్, ముద్దుమూడి, మనుబోలు మండలం

టీడీపీ మద్దతు దారుణం



కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు ముస్లిమేతర వ్యక్తి కావడంతో వక్ఫ్ బిల్లు గురించి ఆయనకు సరైన అవగాహన లేదు. ఈ బిల్లుపై ముస్లింల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోకుండా టీడీపీ మద్దతు ఇవ్వడం దారుణం. దీనిపై వెనక్కు తగ్గాలి.

– షాజహాన్, పడుగుపాడు, కోవూరు

సీఎం బాధ్యత వహించాలి



అత్యంత ప్రతిష్టాత్మకమైన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని యత్నించడం రాక్షస చర్య. అధికార యంత్రాంగం సమక్షంలోనే ఈ దుశ్చర్య జరిగింది. ఈ రాక్షస చర్యను ప్రోత్సహించిన సీఎం చంద్రబాబు బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలి.

– నాగిరెడ్డి రమేష్, మాజీ సర్పంచ్, గౌతమ్‌నగర్, కొడవలూరు మండలం


బిల్లుకు టీడీపీ మద్దతు హేయం



పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించడం హేయమైన చర్య. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకే ఇలాంటి బిల్లులను ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లుగా ఉంది. రూ.లక్షల కోట్ల ఆస్తులు ఉన్న వక్ఫ్‌బోర్డు ఇలాంటి బిల్లుల వల్ల నామమాత్రంగా మారే అవకాశం ఉంటుంది. ఈ సవరణ బిల్లును ప్రతి ఒక్క రాజకీయ పార్టీ ఖండించాల్సిన అవసరం ఉంది.

– ఎస్‌కే ఖాదర్, జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ, పొదలకూరు

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



మనుబోలు : ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి



పొదలకూరు పట్టణంలో..



ఇందుకూరుపేట : గాజులతో విశేషాలంకరణ

మనుబోలు : మనుబోలులోని శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవాలయం(విష్ణాలయం)లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు హనుమాచార్యులు లక్ష్మీదేవికి సుప్రభాత వేళలో పంచామృతాభిషేకం గావించారు. అనంతరం ప్రత్యేకాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

విశేషాభిషేకం

పొదలకూరు : శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీదేవికి డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం లక్ష్మీనారాయణ–లక్ష్మి దంపతులు వ్యవహరించారు. భక్తులు పాలు, పండ్లు, తేనె, పంచధార తీసుకొచ్చి అమ్మవారిని అభిషేకించారు.

- కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం రైటర్‌తోపులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.
- ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాజులతో అమ్మవారిని అలంకరించారు.

పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకోండి

మనుబోలు : ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహిసినా సుల్తానా అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9 లేదా 10వ తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో రక్తహీనతతో బాధపడుతున్న వారిని, హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను గుర్తించి వీరికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ రమణయ్య, ఏఎన్‌ఎం సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ కావ్యశ్రీ, శ్రీరమ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద భారతి హోమ్ కేర్ హెల్త్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ప్రతినెలా వీరు పౌష్టికాహారం అందజేసేందుకు ముందుకు వస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న గర్భిణులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో హోమ్ కేర్ ఎండీ జి.పవన్‌కుమార్, గోపీకృష్ణ, చంద్రశేఖర్, నాగరాజు, మణి, భారతి, సీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

కోవూరు : గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఇనమడుగు పీహెచ్‌సీ డాక్టర్ నిరంజన్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బయోటెక్నాలజీ, మెరైన్ బయాలజీ, ఫుడ్ టెక్నాలజీ, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన మొత్తం 59 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంపెనీ అవసరానికి అనుగుణంగా 14 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ సాంకేతికతలో ఆవిష్కరణలు, అభివృద్ధికి పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారం చాలా అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో కంపెనీ ఆపరేషనల్ మేనేజర్ మోహన్, వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ విజయ పాల్గొన్నారు.

అట్టహాసంగా గంగమ్మ కొలుపు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మతల్లి

పొదలకూరు : పట్టణంలోని గంగమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారి కొలుపు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో తొలిరోజు ఉదయం 7.30 గంటలకు కుంకుమపూజ, అభిషేకం, సహస్ర నామార్చన, మధ్యాహ్నం 2 గంటలకు ఆచారం తెలియజేయడం, సాయంత్రం 3 గంటలకు పూజా కార్యక్రమం నిర్వహించారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



కృష్ణ జషితను అభినందిస్తున్న ప్రిన్సిపల్

ముత్తుకూరు : కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్ విద్యార్థిని జి.కృష్ణ జషిత రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపల్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో 14 కేజీల వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగంలో జషిత బంగారు పతకం సాధించిందన్నారు. ఈ పోటీలో మన రాష్ట్రం నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. బంగారు పతకం సాధించడం ద్వారా జషిత జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వెల్లడించారు. తమ స్కూల్ విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడల్లో కూడా సత్తా చాటుతున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు.

సంపద కేంద్రాలతో ఆర్థిక వనరులు పెంపు

- రాష్ట్ర పరిశీలకురాలు రాజ్యలక్ష్మి



కొడవలూరు సంపద కేంద్రం వద్ద అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

కొడవలూరు : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలో తేవడం ద్వారా పంచాయతీల ఆర్థిక వనరులను పెంచుకోవాలని రాష్ట్ర పరిశీలకురాలు రాజ్యలక్ష్మి సూచించారు. పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం కొడవలూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానపాముల ఉత్పత్తిని అన్ని కేంద్రాల్లో చేపట్టాలని చెప్పారు. తద్వారా పంచాయతీల రాబడి పెంచుకోవాలన్నారు. డీఎల్‌పీఓ కె.రాధా మాధవీలత మాట్లాడుతూ ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, సర్పంచ్‌లు రాజకుమారి, ఎస్.సునీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్‌కుమార్, జి.రాధాకృష్ణ, వగ్గు శీనయ్య, ఎం.బ్రహ్మానందరెడ్డి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సంపద కేంద్రం సందర్శన

పొదలకూరు : మండలంలోని సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో రెండోరోజు శుక్రవారం చాటగొట్లలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సర్పంచులతో కలిసి అధికారులు సందర్శించారు. క్షేత్రస్థాయిలో వీటి పనితీరుపై వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహ్మద్‌రఫీ మాట్లాడుతూ తడి, పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ డి.దుర్గాదొరబాబు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే కీలకం

విడవలూరు : గ్రామ స్వరాజ్య స్థాపనకు పంచాయతీల అభివృద్ధే కీలకమని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వరిణిలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద సర్పంచ్‌లు, కార్యదర్శులతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లికార్జునరావు, సర్పంచ్ సుప్రజ, ఎంపీటీసీ భక్తవత్సలం, కార్యదర్శి సుఖన్య పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

కోవూరు : రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.